బీజేపీలో మరింత ఉత్సాహం

- ఇప్పటికే మజ్లిస్‌కు దీటుగా ఎన్నికల ప్రచారంలో బీజేపీ
- బరిలో నలుగురు అభ్యర్థులున్నా.. మజ్లిస్ వర్సెస్ బీజేపీనే..
- అమిత్ షా పర్యటనతో దూసుకుపోనున్న బీజేపీ

చార్మినార్: పాతబస్తీలోని బీజేపీ శ్రేణుల్లో కేంద్ర మంత్రి అమిత్ షా రోడ్డు షో ఉత్సాహాన్ని నింపింది. ఇప్పటికే మజ్లిస్ పార్టీకి ధీటుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ..అమిత్ షా పర్యటనతో మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పార్టీ అభిమానులు అమిత్ షా రోడ్డు షోలో పాల్గొనడానికి పెద్ద ఎత్తున లాల్‌దర్వాజకు తరలి వచ్చారు.

దూసుకుపోనున్న మాధవీలత..

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ వర్సెస్ బీజేపీగా ఉండనుంది. మజ్లిస్ పార్టీని బీజేపీ ఢీ కొట్టనుంది. ఇప్పటికే మాధవీలత తన ఎన్నికల ప్రచారంలో తలమునకలైంది. సోషల్ మీడియా ద్వారా బోలేడు పబ్లిసిటీ వచ్చింది. రాజకీయంగా హైదరాబాద్ అంటేనే.. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఎప్పటికీ దేశ వ్యాప్తంగా వార్తల్లో వ్యక్తి అసదుద్దీన్ ఒవైసీని టార్గెట్‌గా చేసుకుని మాధవీలత తన ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. 40 ఏళ్లుగా మజ్లిస్ పార్టీ పాతబస్తీకి చేసిందేమిటో చెప్పాలంటూ బహిరంగంగా ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం రాత్రి కేంద్ర మంత్రి అమిత్ షా రోడ్డు షో విజయవంతం కావడంతో మరింత ఉత్సాహంగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

పోటీలో నలుగురు ప్రధాన పార్టీల అభ్యర్థులున్నా..

హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు బీజేపీ అభ్యర్థి మాధవీలత, బీఆర్ఎస్ నుంచి గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నుంచి మహ్మద్ వలీ ఉల్లా సమీర్ తదితర నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మజ్లిస్ పార్టీ, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే తమ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తుండగా..బీఆర్ఎస్ అభ్యర్థి పార్టీ అభ్యర్థి ఇంకా ఎన్నికల ప్రచారాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభించ లేదు. ఇక కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడంతో ఎన్నికల ప్రచారంలో వెనుకబడ్డారు. మలక్‌పేట్ నియోజకవర్గంలోని చాదర్‌ఘాట్‌లో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన కొంత మంది నాయకులతో కలిసి అక్కడక్కడ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇక ఈ ఎన్నికల్లో ఎంబీటీ పోటీ చేయడం లేదు. దీంతో హైదరాబాద్‌లో మజ్లిస్‌కు ధీటుగా బీజేపీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది.

ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

- ఎన్నికల ఏఆర్‌ఓలు విక్టర్, విద్యాధర్ వెల్లడి
- నియోజకవర్గంలోని 235 పోలింగ్ బూత్‌లో ఎన్నికలు
- ఓటును వినియోగించుకోనున్న 2,74,522 మంది ఓటర్లు
- 102 పోలింగ్‌స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లుగా గుర్తింపు


మాట్లాడుతున్న ఏఆర్‌ఓలు విక్టర్, విద్యాధర్

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల ఏఆర్ఓలు వీ.విక్టర్, ఎస్.విద్యాధర్ వెల్లడించారు. నియోజకవర్గంలోని 235 పోలింగ్ బూత్‌లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,74,522 మంది తమ ఓటు హక్కును ఈనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో వినియోగించుకుంటారని వారు వివరించారు. గురువారం అబిడ్స్ మున్సిపల్ కార్యాలయంలోని ఏఆర్‌ఓ కార్యాలయంలో వారు మాట్లాడుతూ..13న ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. నియోజకవర్గంలోని 102 పోలింగ్‌స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లుగా గుర్తించామన్నారు. ఆ స్టేషన్లలో భారీ ఎత్తున భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా వేసవి కాలం ఉండడంతో ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద తాగునీటిలో వసతులు కల్పిస్తామన్నారు. ఎండలతో ఓటర్లు ఇబ్బంది పడకుండా టెంట్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

రూ.7,97,00,000 సీజ్..

ప్రతిరోజూ ఎన్నికల స్క్వాడ్స్ సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీల్లో గురువారం నాటికి గోషామహల్ నలుమూలల రూ.7,97,00,000లను సీజ్ చేశామన్నారు. రూ.50,000 పైగా ఎలాంటి వివరణ లేకుండా తరలిస్తున్న డబ్బులను సీజ్ చేసి సంబంధిత ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగిస్తున్నామన్నారు. ప్రతి రోజూ దాదాపు పది స్పెషల్ టీమ్‌ల ద్వారా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పోలీసులతో కలిసి తనిఖీ చేపడుతున్నామన్నారు.

అబిడ్స్ ఆల్ సెయింట్ స్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్స్..


అబిడ్స్ ఆల్ సెయింట్ స్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్స్ వినియోగించే విధంగా ఏర్పాటు చేశామని ఏఆర్‌ఓలు వి.విక్టర్, విద్యాధర్ తెలిపారు. ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని దాదాపు 800 మంది ఉద్యోగులు ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి నేరుగా ఆల్ సెయింట్ హైస్కూల్‌కు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను అందరూ ఉద్యోగులు వేసే విధంగా ఏర్పాట్లు ముమ్మరంగా చేశామన్నారు.

ఆహ్వానం



యాకుత్‌పురా: సిటీ సివిల్ కోర్టులో నిర్వహించే నూతన బార్ అసోసియేషన్ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ గురువారం అసోసియేషన్ సంయుక్తా కార్యదర్శి బర్కా రాజేష్‌కుమార్ గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, సభ్యులు రాధాకృష్ణ, రావి, వినోద్ కుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.

సుల్తాన్‌షాహిలో మజ్లిస్ పార్టీ ప్రచారం



యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ఓటర్లను కోరారు. సార్వత్రికల ఎన్నికల సందర్భంగా మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. తలాబ్ కట్టా, మొఘల్‌పురా ఓల్డా హోటల్, సుల్తాన్‌షాహి, మీర్ కా దయారా తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ మజ్లిస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మొఘల్‌పురా కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా, యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ అరఫత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



అబిడ్స్: కార్మికుల సంక్షేమానికి వాటర్‌బోర్డు ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు బోర్డు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..వాటర్‌బోర్డు పరిధిలోని అన్ని సెక్షన్ కార్యాలయంలో కార్మికులు ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి వారి సంక్షేమానికి ఎంప్లాయిస్ యూనియన్ ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.యాదగిరి, డీజీఎం కిషోర్, మేనేజర్ సయ్యద్ అబ్దుల్లా, ఎండీ ఆరీఫ్, మన్సూర్ అలీ, కృష్ణ పాల్గొన్నారు.

ఆధారాలు లేని రూ.9 లక్షల నగదు స్వాధీనం

నాంపల్లి: హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడి నుంచి రూ.9లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు, పత్రాలు లేకపోవడంతో పట్టుబడిన సొత్తును హైదరాబాద్ జిల్లా గ్రీవిన్స్ కమిటీకి అందజేశారు. హైదరాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీకి చెందిన బాపట్ల జిల్లా, పాపయ్య పాలెంలోని చీరాలలో ఓ వేరుశనగ మిల్లులో గుమస్తాగా పనిచేసే చెన్నయ్య కుమారుడు ఎ.బాలకృష్ణ (28) గురువారం హైదరాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-4 మీద ఓ బ్యాగుతో నిల్చొని ఉన్నారు. ఎన్నికల నిబంధనల దృష్ట్యా రైల్వే స్టేషన్‌లో గురువారం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అతడి బ్యాగును తనిఖీ చేశారు. బాలకృష్ణ బ్యాగులో రూ.9లక్షలు నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నగదు విషయమైన సరైన సమాధానం చెప్పకపోవడం, ఎలాంటి ఆధారాలు, పత్రాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అతడు చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో చీరాల వద్ద వేరుశెనగ వ్యాపార ప్రయోజనం దృష్ట్యా తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని జిల్లా గ్రీవిన్స్ కమిటీకి అందజేశారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

నాంపల్లి: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జీహెచ్ఎంసీ సర్కిల్-12 ఏసీపీ కృష్ణమూర్తి హెచ్చరించారు. రెండు రోజులుగా మాసబ్‌ట్యాంక్ మహవీర్ ఆసుపత్రి వద్ద ఓ భవనం స్టిల్ ప్లస్ త్రీ ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని ఐదు ఫ్లోర్స్, పెంట్ హౌస్ నిర్మించారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు అందజేసి రెండు రోజులుగా నాలుగు, ఐదు అంతస్తులు, పెంట్ హౌస్‌ను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణమూర్తి మాట్లాడుతూ..భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావుతో పాటుగా బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన కేసులో వ్యక్తికి 15 రోజుల జైలు

గౌలిపురా: దొంగతనానికి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ డీసీ.ఉమాపతిరావు 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్బర్ (42) ఇటీవల భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాడ్‌తో తిరుగుతూ దొంగతనానికి యత్నించాడు. ఈ కేసులో మహ్మద్ అక్బర్‌ను అరెస్ట్ చేసి ఈ-పెట్టీ కేసు నమోదు చేసుకొని నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

అవార్డుల ప్రదానం



గన్‌ఫౌండ్రీ: మెగా సిటీ నవకళా వేదిక, మదర్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు డాక్టర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. అవార్డులు బాధ్యతలను పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, ప్రొఫెసర్ డీకేరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది డీఎల్ పాండు, నిర్వాహకులు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రపై అవగాహన సదస్సు



నాంపల్లి: హజ్ యాత్ర ఎంతో పవిత్రమైనదని పలువురు ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. గురువారం గోషామహల్ నియోజకవర్గం పబ్లిక్‌గార్డెన్ రోడ్డులోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో హజ్ యాత్రపై అవగాహన సదస్సు జరిగింది. హజ్ కమిటీ మాజీ చైర్మన్ మహ్మద్ సలీం అధ్యక్షతన జరిగిన సదస్సుకు జామియా నిజామియా ముఫ్తి సాధిక్ మొహియుద్దీన్, పబ్లిక్‌గార్డెన్ మసీదు ఖతీబ్ అహెషన్ అల్ మమియా, మక్కా మసీదు ఖతీబ్ హఫీజ్ రిజ్వాన్ ఖురేషీ, జమాతే ఇస్లామీ హమీద్ మహ్మద్ ఖాన్, ఎమ్మెల్సీ ఆమేర్ అలీ ఖాన్, జామియా నిజామియా జియావుద్దీన్ నక్షాబందీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ..హజ్ యాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించే విధంగా ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. ఈనెల 9న మొదటి విమానం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మొదటి విమానం బయలుదేరుతుందన్నారు. అనంతరం సదస్సుకు హాజరైన మత పెద్దలను మహ్మద్ సలీం సన్మానించారు.

‘ప్రజల మన్ననలు పొందిన ఏకైక పార్టీ కాంగ్రెస్’



లంగర్‌హౌస్: ప్రజల మన్ననలు పొందిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కార్వాన్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు చంటిబాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురవారం సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారంటీలతో పాటు ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యం రెడ్డి, పరమానందం, రఘుపాల్‌రెడ్డి, వెంకట క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రజాకారుల పాలన అంతం బీజేపీతోనే సాధ్యం


మాధవీలతను గజమాలతో సత్కరిస్తున్న వైష్ణవ్ గౌడ్, అభినవ్‌గౌడ్

అబిడ్స్: రజాకారుల పాలన అంతం బీజేపీతోనే సాధ్యమని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత పేర్కొన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు రజాకారుల పాలన తరహాలోనే ముందుకు వెళ్తున్నాయన్నారు. గురువారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌలిగూడలో యువ నాయకులు వైష్ణవ్ గౌడ్, అభినవ్ గౌడ్ ఆధ్వర్యంలో మాధవీలతను గజమాలతో సత్కరించి రామబాణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..రాష్ట్రంలోని కాంగ్రెస్ అగ్ర నాయకులు ఓటమి భయంతో ప్రధాని మోదీపై కేంద్ర బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. అసదుద్దీన్ ఒవైసీ అసత్య ప్రచారాలకు దిగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీశ్వ సురేఖ, బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకులు భీశ్వ ఓంప్రకాష్, కృష్ణ, యమన్‌సింగ్ పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్, ఈఎస్‌సీఐ మధ్య అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న దృశ్యం

గోల్కొండ: వినూత్నమైన, వైవిధ్యమైన విషయాలపై అవగాహన కల్పించే సంకల్పంతో తాము షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా కళాశాల వారితో ఒప్పందం చేసుకున్నామని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సంచాలకులు డాక్టర్ రామేశ్వర్‌రావు అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జీఎన్ఐటీఎస్ కళాశాలలో నలుగురు దివ్యాంగులతో ఒక స్టార్టప్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. ఈ స్టార్టప్ కార్యక్రమం ప్రారంభిస్తూ ఆయన దీనిపై మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహం నింపుతాయని సరికొత్త విషయాలపై రిసర్చ్ చేయడానికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. రెండు రోజుల పాటు ఈ డీ-హబ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. దివ్యాంగులైన హైమావతి, ఉలిగమ్మ, సతీష్, మాధవీ తదితరులకు స్టార్టప్ ప్రోగ్రామ్ ఉద్దేశం వివరించి వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడం జరుగుతుందన్నారు. జీఎన్ఐటీఎస్ చైర్మన్ జి.శ్రీవిద్యరెడ్డి మాట్లాడుతూ.. ఈఎస్‌సీఐ వారు తమ కళాశాలతో అవగాహన ఒప్పందం చేసుకోవడం తమకు ఎంతో ప్రయోజనం కలిగించే విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎస్‌సీఐఎఫ్‌డీపీ హెడ్ ఐ.కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, ఆర్అండ్‌డీ విభాగం డీన్ డాక్టర్ ఎన్.సీత, ఎస్.కల్యాణి, డాక్టర్ శశ్వక్ పాటక్, ఎస్.ఆరాధన పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలి


ప్రచారంలో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ తదితర డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మజ్లిస్ గుర్తు గల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..హైదరాబాద్ నగర అభివృద్ధికి మజ్లిస్ పార్టీ ఎంతగానో కృషి చేసిందన్నారు. అసదుద్దీన్ ఒవైసీ చొరవ వల్లే నేడు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. మజ్లిస్ పార్టీలో కులమతాలకు అతీతంగా యువత, మహిళలకు ప్రత్యేకంగా తమ పార్టీ అధ్యక్షుడు కీలక పదవులు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అజమ్, షకీల్ ఆలీఖాన్, వజీఉజ్‌జమా సిద్దిఖి తదితరులున్నారు.

మతతత్వ మజ్లిస్, బీజేపీలను నమ్మకండి


అబిడ్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: మతతత్వ మజ్లిస్ బీజేపీలను ప్రజలు నమ్మొద్దని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మతం పేరుతో 40 ఏళ్లుగా హైదరాబాద్‌లో విజయం సాధిస్తున్న మజ్లిస్ పార్టీ ముస్లింలతో పాటు ఇతర వర్గాలకు కూడా ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆయన ఆరోపించారు. గురువారం గోషామహల్ నియోజకవర్గంలోని అబిడ్స్, మురళీధర్‌బాగ్, ఎంజే మార్కెట్, కట్టెల మండి ప్రాంతాల్లో ఇంటింటా తిరుగుతూ..బీఆర్ఎస్‌ని గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..తనని గెలిపిస్తే హైదరాబాద్‌ను భారతదేశంలోని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఒవైసీ, మాధవీలతలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మతం పేరు చెప్పి ప్రచారం చేస్తున్నాయన్నారు. మోసపూరిత మాటలు చెప్పే మజ్లిస్, బీజేపీలను ప్రజలు ఎక్కడ పోయినా తిరస్కరిస్తున్నారని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఆర్మీ మహేందర్ కుమార్, వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మరల్చి సెల్‌ఫోన్ చోరీ.. నలుగురి రిమాండ్

డబీర్‌పురా: ప్రయాణికుడి దృష్టి మరల్చి సెల్‌ఫోన్ చోరీ చేయడంతో పాటు అతని అకౌంట్‌లోని డబ్బులను కాజేసిన నలుగురు నిందితులను మీర్‌చౌక్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ రవీందర్‌లతో కలిసి నిందితులను వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన మహ్మద్ అబ్దుల్ జలీల్ గతనెల 25న నయాపూల్ చౌరస్తాలో ఎంజీబీఎస్‌కు వెళ్లడానికి ఆటో కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో హఫీజ్‌బాబానగర్‌కు చెందిన అబ్దుల్ ఖాజా (30), మహ్మద్ ఇంతియాస్ (24), ఫతేషానగర్‌కు చెందిన మహ్మద్ నవాజ్ (25), షాహీనగర్‌కు చెందిన గులాం హసన్ (23) వచ్చి ఆటోలో తీసుకెళ్లారు. జలీల్ కొత్తగూడెంకు వెళ్లి చూసుకోగా సెల్‌ఫోన్ చోరికి గురైనట్లు తన అకౌంట్‌లో నుంచి రూ.20 వేలు డ్రా చేసినట్లు గుర్తించి. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అబ్దుల్ ఖాజా, మహ్మద్ ఇంతియాజ్, మహ్మద్ నవాజ్, గులాం హసన్‌ను బుధవారం అరెస్ట్ చేసి మూడు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సమాజంలో యువ కవుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ప్రముఖ కవి, పర్యాటకుడు పరవస్తు లోకేశ్వర్

గౌలిపురా: సమాజంలో యువ కవుల పాత్ర కీలకమైందని ప్రముఖ కవి, పర్యాటకుడు పరవస్తు లోకేశ్వర్ అన్నారు. హనుమాన్‌నగర్‌లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) శ్రీశ్రీ జయంతి సందర్భంగా జ్ఞాన భారతి మోడల్ స్కూల్‌లో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా లోకేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాతనగరం, హైదరాబాద్ నగరం చారిత్రాక నేపథ్యం కలిగి ఉండటం గమనించాలని..ఎందరో కవులకు నిలయం హైదరాబాద్ నగరం అన్నారు. అభ్యుదయ రచయితలు సైనికుల వంటి వారని..శాంతి, సమాజ చైతన్యం వారి ధ్యేయమని లా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సంతోష్ అన్నారు. డాక్టర్ ఎస్.సూర్యప్రకాశ్ అధ్యక్షతన వహించగా జి.చంద్రమోహన్ గౌడ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటచారి, అటుకుల రాజు, రేడియం అలియాస్ కొండన్న, లా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సంతోష్, డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, డాక్టర్ వేముల నారాయణ, జ్ఞాన భారతి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త ప్రభాకర్ రావు, శ్రీనివాస్, జి.మల్లేష్, పి.సునిల్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బీజేపీ విజయం ఖాయం



గోల్కొండ: ఈసారి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమని సీనియర్ బీజేపీ నాయకుడు టోలిచౌకీ డివిజన్ ఇన్‌చార్జి పూర్ణచంద్రరావు అన్నారు. గురువారం టోలిచౌకీ బంజారా దర్వాజ వద్ద ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం నగరంలో జరిగిన అమిత్‌షా సభ, రోడ్ షో కు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. రోజురోజుకూ బీజేపీ బలం పుంజుకుంటూ వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈసారి హైదరాబాద్ లోక్‌సభ స్థానంతో పాటు తెలంగాణలో అత్యధిక స్థానాలు గెలుచుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, నాయకులు నర్సింగ్‌రావు, రామకృష్ణ, జగదీష్, శివరాజ్, సురేష్‌చారి, వినయ్, శశాంక్ తదితరులున్నారు.

భూవివాదం కేసులో ముగ్గురికి 25 నెలల జైలు

గౌలిపురా: భూ వివాదంలో నిందితులుగా ఉన్న ముగ్గురికి నాంపల్లిలోని 8వ ఏసీఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ కవిత 25 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016లో ఎ.చంద్రశేఖర్, షేక్ అబ్దుల్ ఖాదర్ బిన్ ఉమర్ అలీ అల్ ఆమోదీ, సయ్యద్ అలీ అహ్మద్ భూ వివాదంలో నిందితులుగా ఉన్నారు. వీరిని నాంపల్లిలోని 8వ ఏసీఎంఎం కోర్టులో బుధవారం హాజరుపరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితులకు 25 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జియాగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం..పురానాపూల్ భవానీ లిక్కర్‌మార్ట్ వైన్స్ వద్ద ఓ వ్యక్తి మృతదేహం(40)పడిఉన్నట్లు సమాచారం లభించడంతో ఘటన స్థలానికి వెళ్లి వాకాబు చేశాం. ఎలాంటి వివరాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘మేరు కులస్తుల మద్దతు కాంగ్రెస్‌కే’


మేరు కులస్తులతో కలిసి ప్రచారం నిర్వహించిన పోల్కం శ్రీనివాస్


అబిడ్స్: మేరు కులస్తులంతా పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తారని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గత ఎన్నికల మాదిరిగా పార్లమెంట్ ఎన్నిల్లో కూడా 17 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్, పార్టీ గెలిచే విధంగా రాష్ట్రంలో ఉన్న 20 లక్షల మంది మేరు కులస్తులు కాంగెస్‌కు ఓటు వేసి గెలిపించేందుకు ముందుంటారన్నారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..మేరు కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మేరు కులస్తులకు చేసిన కృషి జీవితంలో మరువలేమన్నారు. తెలంగాణ రాష్ట్రం మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, బి.రాములు యాదవ్, శివకుమార్, పోల్కం వినయ్ రాజ్, గంగాపురం దశరథ్ రైతు సంఘం చౌటుప్పల్ మండలం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్‌దే విజయం



చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని చార్మినార్ శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్‌తో పాటు మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారన్నారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌తో కలిసి వారు పాతబస్తీలోని ఘాన్సీబజార్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఆరు గ్యారంటీల అమలు కరపత్రాలను ఓటర్లకు అందజేసి కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తమ పార్టీ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. అన్ని వర్గాల ఓటర్లు తనకే ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అభ్యర్థి మహ్మద్ వలి ఉల్లా సమీర్ ధీమా వ్యక్తం చేశారు.

సమాజ సేవతోనే మానసిక ఆనందం



సుల్తాన్‌బజార్: సమాజ సేవతోనే మానసిక ఆనందం ఉంటుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాజా బహదూర్ వెంకట్‌రామిరెడ్డి వసతి గృహం నిర్వహణకు సహకరించడం ఎంతో అభినందనీయమన్నారు. అబిడ్స్‌లోని రాజా బహదూర్ వెంకట్‌రామిరెడ్డి వసతి గృహం వార్షికోత్సవ వేడుకల్లో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డితో కలిసి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థుల కోసం టేబుల్ టెన్నిస్ టేబుల్స్‌ను విరాళంగా ఇచ్చిన ఎల్.మంజిత్‌రెడ్డి, పి.లక్ష్మారెడ్డిను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి అభినందించారు. అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు సుకన్యరెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి వాసుదేవ రెడ్డి, కోశాధికారి కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.